వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి
- టీడీపీ నుంచి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతిఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని పార్టీ నగర నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నగరంలోని 45వ డివిజన్‌కు చెందిన 50 టీడీపీ కుటుంబాలు నగర పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ క్రమంలో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకుంటామని పార్టీలో చేరిన వారు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత వల్ల వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరుగుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ప్రజల ఆకాంక్షలను వమ్ము చేసి ప్రజాగ్రహానికి గురైందన్నారు. చంద్రబాబు నాయుడు చేస్తున్న దుర్మార్గాలు, మోసాలను చూసి ప్రజలు చీదరించుకుంటున్నారని తెలియజేశారు. ఈ క్రమంలో జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేని తెలుగుదేశం పార్టీ ఆయన పర్యటనలను ఎక్కడికక్కడ అడ్డుకుని అక్రమ కేసులు బనాయిస్తోందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్‌సీపీదే గెలుపన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ 45వ డివిజన్ ఇన్‌చార్జి నేతాజీ సుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా న్యాయ దినోత్సవం



నెల్లూరు (టౌన్): స్థానిక బాలాజీనగర్‌లోని వికాస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గురువారం న్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. న్యాయవాది శింగంశెట్టి శ్రీరామ్ హాజరై, న్యాయ వ్యవస్థ కార్యకలాపాలను వివరించారు. విద్యార్థి దశ నుంచే అన్యాయంపై ప్రశ్నించడం నేర్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు మాక్ కోర్టు నిర్వహించారు. అనంతరం శ్రీరామ్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ కర్తం ప్రతాప్‌రెడ్డి, ప్రిన్సిపల్ జ్యోతి పాల్గొన్నారు.

ఫీవర్ సర్వే చేపట్టాలి


మాట్లాడుతున్న మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ

నెల్లూరు (టౌన్): జాతీయ డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే నిర్వహించాలని జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ తెలిపారు. జనార్దనరెడ్డికాలనీ, పీసీనాయుడు స్ట్రీట్ ప్రాంతాల్లో యూపీహెచ్‌సీ ఫీల్డ్ సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు, నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

మర్యాదపూర్వకంగా..


మొయిళ్ల గౌరితో మాట్లాడుతున్న రోజా

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మాజీ మంత్రి, నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్కే రోజాను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి గురువారం నగరిలో మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా విభాగం క్రియాశీలకంగా పనిచేసేలా రోజా పలు సూచనలు చేశారు.

ముగిసిన శిక్షణ


మాట్లాడుతున్న మెప్మా పీడీ

నెల్లూరు(బారకాసు): మూడు రోజుల ఈడీపీ శిక్షణా కార్యక్రమం కార్పొరేషన్ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో గురువారం ముగిసింది. ఇందులో మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.లీలారాణి పాల్గొని, మాట్లాడారు. స్వయం ఉపాధికి ముందడుగు వేయాలంటే, ఈ శిక్షణను ఆయుధంలా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ శిక్షణలో బిజినెస్ ఐడియాలు, మార్కెటింగ్ పద్ధతులు, ప్రాజెక్ట్ ప్లానింగ్, డిజిటల్ టూల్స్‌పై అవగాహన కల్పించారు.

నేలటూరులో అగ్నిప్రమాదం


మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని నేలటూరు గ్రామంలో గురువారం అగ్నిప్రమాదం జరిగింది. పుల్లయ్య అనే వ్యక్తికి చెందిన వంట గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పక్కనున్న టీ దుకాణం, చుట్టుపక్కల ఇళ్లకు మంటలు వ్యాపించకుండా ఆర్పివేశారు.

వడ్డిపాళెంలో పోలీస్ పికెట్



ముత్తుకూరు(పొదలకూరు): మండలంలోని పిడతాపోలూరు పంచాయతీ కట్టకింద వడ్డిపాళెంలో పోలీస్ పికెట్ నిర్వహిస్తున్నారు. బుధవారం వడ్డిపాళెంలో ఓ వర్గం వారు మరో వర్గం వారి ఇళ్లపై దాడులు చేసి గాయపరిచిన విషయం తెలిసిందే. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నారు.

హత్యాయత్నం కేసులో రౌడీషీటర్ అరెస్ట్


కేసు వివరాలు వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్

నెల్లూరు(క్రైమ్): హత్యాయత్నం కేసులో రౌడీషీటర్‌ను వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు నిందితుడి వివరాలను గురువారం వెల్లడించారు. పాత గొడవల నేపథ్యంలో బుజబుజనెల్లూరుకు చెందిన నూరుద్దీన్‌పై ఈఏడాది ఫిబ్రవరి 26న దేవా, రసూల్, శ్రీను, చంద్రబాబునగర్‌కు చెందిన రౌడీషీటర్ తన్వీర్ మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇందులో ముగ్గురు నిందితులను ఇప్పటికే అరెస్ట్ చేయగా పరారీలో ఉన్న తన్వీర్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఎస్సై ముత్యాలయ్య ఆర్టీసీ కాలనీ వద్ద తన్వీర్‌ను గురువారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగలించిన బైక్, హత్యాయత్నానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఎస్సైలు ముత్యాలయ్య, నవీన్ పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలపై చర్యలు


మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): అనుమతుల్లేకుండా చేపట్టే నిర్మాణాలు, అక్రమ కట్టడాలను గుర్తించి, సంబంధిత యజమానులపై చార్జ్‌షీట్లు దాఖలు చేసి నోటీసులు జారీ చేయాలని కమిషనర్ వైఓ నందన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతులకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనాలకు చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. చార్జిషీట్లలో అన్ని వివరాలను సమగ్రంగా పొందుపరిచి, తీసుకోవాల్సిన చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. చార్జ్‌షీట్ ఆధారంగా కోర్టు మంజూరు చేసిన సమన్లను భవన యజమానులకు స్వయంగా అందజేయాలన్నారు. సచివాలయ పరిధిలోని అనధికార లేఅవుట్లను గుర్తించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ వేణు, డీపీఓ రఘునాథ్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను క్రమబద్ధీకరించాలి


చలో విజయవాడ పోస్టర్ల ఆవిష్కరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ సంస్థలో 20 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. నగరంలోని సంతపేటలో ఉన్న సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేస్తున్న క్రమంలో మీటర్ రీడర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 21న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో చేపట్టనున్న చలో విజయవాడ కార్యక్రమానికి జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నవీన్, హజరత్‌వలీ, కృష్ణ, శిరీష, సంతోష్, ఫిరోజ్ పాల్గొన్నారు.

రుక్మిణి కల్యాణంపై ఉపన్యాసం



నెల్లూరు(బృందావనం): పద్యసారస్వత పరిషత్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నవలాకులతోటలోని రామకృష్ణ మిషన్‌లో జరుగుతున్న భాగవత ప్రవచన సప్తాహంలో 'రుక్మిణి కల్యాణం'పై ఉపన్యాస కార్యక్రమం గురువారం రాత్రి జరిగింది. పద్యసారస్వత పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ చీమకుర్తి వెంకటేశ్వరరావు సంచాలకులుగా, సభా పోషకులుగా అన్నవరపు సత్యనారాయణ వ్యవహరించారు. ఈ సందర్భంగా పోలవరపు లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ బుద్ధిని భగవంతుని వైపు మళ్లించడమే రుక్మిణి కల్యాణమని తెలిపారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ నిర్వాహకుడు స్వామి మృదానంద మహరాజ్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు అధ్యక్షుడు నలుబోలు బలరామయ్య నాయుడు, డాక్టర్ మోహన్‌రాజు, తుర్లపాటి లక్ష్మీనారాయణ, సీహెచ్.జయప్రసాద్, కోట శ్రీరామమూర్తి, ఎ.సుబ్బారావు, సూరం చంద్రశేఖరం, కె.మురళీకృష్ణ, జయచంద్ర, మాల్యాద్రి, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థి మృతిపై విచారణకు డిమాండ్


ఏఎస్పీకి వినతిపత్రం అందజేత

నెల్లూరు(క్రైమ్): డీ ఫార్మసీ విద్యార్థి మృతిపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ నాయకులు పోలీసు అధికారులను కోరారు. ఈ మేరకు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య, మృతుని కుటుంబసభ్యులు గురువారం జిల్లా పోలీసు కార్యాయలంలో ఏఎస్పీ సౌజన్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జానా శ్రీకాంత్(22) ఓ కళాశాలలో డీ ఫార్మసీ చదువుకుంటూ పార్ట్‌టైమ్ కింద ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో ఫార్మసిస్టుగా పనిచేస్తున్నారన్నారు. బుధవారం ఆయన అదే హాస్పిటల్‌లో మృతిచెందారని, దీనిపై అనేక అనుమానాలున్నాయన్నారు. మృతుని కుటుంబసభ్యులకు తెలియకుండా తామే బంధువులమంటూ కొందరు పోస్టుమార్టానికి పూనుకోవడం అనుమానాలకు బలం చేకూర్చే విధంగా ఉందని చెప్పారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో 37వ ర్యాంక్

నెల్లూరు(బారకాసు): స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో 2024–25 వార్షిక సంవత్సరానికి నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ జాతీయ స్థాయిలో 37వ ర్యాంక్ సాధించిందని కమిషనర్ నందన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన ద్వారా వివరాలను గురువారం తెలియజేశారు. గతేడాది జాతీయ స్థాయిలో 130వ ర్యాంక్‌లో ఉన్న నెల్లూరు నగరం, ఈ ఏడాది అసాధారణ పురోగతిని నమోదు చేయడం గర్వకారణంగా నిలిచిందని తెలిపారు.

స్విమ్మింగ్ కోచ్ అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): చిన్నారి మృతి కేసులో స్విమ్మింగ్ కోచ్‌ను దర్గామిట్ట పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని సప్తగిరి లేఅవుట్‌లో వంశీకృష్ణ- ఆదిలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమార్తె మనస్వి(9), కుమారుడు సంతానం. కుమార్తెకు ఈత నేర్పించేందుకు ఈ ఏడాది మార్చి 26వ తేదీన తల్లిదండ్రులు సి.సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫీజు చెల్లించారు. 27న కుమార్తెను తీసుకుని వారు స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లారు. మీరు దగ్గరుంటే చిన్నారి స్విమ్మింగ్ నేర్చుకోలేదని సిబ్బంది తల్లిదండ్రులను అక్కడి నుంచి పంపివేశారు. ఏమైందో తెలియదు కానీ స్విమ్మింగ్ చేస్తుండగా చిన్నారి మృతిచెందింది. అప్పట్లో కోచ్‌తో పాటు అక్కడున్న వారి నిర్లక్ష్యంతో కుమార్తె మృతిచెందినట్లు బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్ రోశయ్య విచారణ చేపట్టారు. గురువారం స్విమ్మింగ్ కోచ్ నాగరాజును అరెస్ట్ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

శ్రీకృష్ణదేవరాయల సాహిత్య విశ్లేషణ రేపు

నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో శ్రీకృష్ణదేవరాయలు–అష్టదిగ్గజ కవుల సాహిత్య చారిత్రక విశ్లేషణ అంశంపై శనివారం సభ ఉంటుందని చేతన సంగీత సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వాహకులు డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం, వై.శేషగిరీశం గురువారం తెలిపారు. ఈ అంశంపై కవిరత్న ఆచార్య పాయసం సుబ్రహ్మణ్య మహర్షి ప్రసంగించనున్నారన్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభం కానున్న కార్యక్రమంలో కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని, జయప్రదం చేయాలని కోరారు.

ఏఎంసీ చైర్మన్ల నియామకం

నెల్లూరు (పొగతోట): రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మనుబోలు శ్రీధర్‌రెడ్డి, ఆత్మకూరుకు ఎ.జనార్దన్‌నాయుడు, రాపూరుకు ఆవుల వాణి, కావలికి పోతుగంటి అలేఖ్యలను చైర్మన్లుగా నియమించారు. వీరందరూ టీడీపీ అభ్యర్థులే.

కామధేను ప్రాజెక్ట్ అభివృద్ధిపై దృష్టి

కోవూరు: జిల్లాలోని చింతలదేవిలో ఉన్న కామధేను ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఏపీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయకుమార్ తెలిపారు. కోవూరులోని కొత్తూరు రోడ్డులో ఉన్న పశు గణాభివృద్ధి సంస్థ జిల్లా కార్యాలయంలో సర్వసభ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కామధేను ప్రాజెక్టులో 500కు పైగా ఆవులు, 300కు పైగా గొర్రెలు ఉన్నాయన్నారు. ప్రధానంగా మేలు జాతి పశు సంపద అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మేలుజాతి పెయ్యదూడల ఉత్పత్తికి సార్టెడ్ సెమన్‌ను రూ.156లకే అందించేలా చొరవ తీసుకుంటామన్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో ఉన్న ల్యాబ్‌లో కూడా పిండమార్పిడి ఉత్పత్తి ప్రయోగాలు చేస్తున్నారన్నారు. అనంతరం డీఎల్‌డీఏ చీఫ్ ఈఓ, డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇక్కడి కార్యాలయ ప్రహరీకి రూ.10 లక్షలు, అదేవిధంగా కార్యాలయం నుంచి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షలతో అంచనాలు వేశామన్నారు. కార్యక్రమంలో విజయా డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, చింతలదేవి కామధేను ప్రాజెక్టు ఇన్‌చార్జి జేడీ సూర్యనారాయణ, నాబార్డు డీడీఎం డాక్టర్ బాబు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య వాహనాలను వినియోగించండి


వెహికల్ షెడ్‌లోని వాహనాలను పరిశీలిస్తున్న కమిషనర్ నందన్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలోని చెత్త సేకరణకు మినీ వాహనాలు, ట్రాక్టర్లు, స్వీపింగ్ మెషీన్లు, ఇతర వాహనాలను క్రమం తప్పకుండా ప్రతిరోజు విధుల్లో ఉపయోగించాలని కమిషనర్ నందన్ ఆదేశించారు. పారిశుద్ధ్య పర్యవేక్షణలో భాగంగా స్థానిక 42వ డివిజన్ కుక్కలగుంట ప్రాంతంలో కార్పొరేషన్ వెహికల్ షెడ్డును కమిషనర్ గురువారం తనిఖీ చేశారు. అక్కడ ఉన్న కొన్ని వాహనాలను ఎందుకు వినియోగించడం లేదని అధికారులను విచారించారు. చిన్నపాటి మరమ్మతులు, ఇతర సమస్యలు ఉంటే వెంటనే పూర్తి చేసి వినియోగించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ విభాగం ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణలో అంశాలను అమలు చేయండి

బీఎల్వోలు శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని నగర నియోజకవర్గ ఈఆర్వో నందన్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో చివరి రోజు శిక్షణా తరగతులను ఆయన గురువారం పర్యవేక్షించి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని 265 మంది బీఎల్వోలు వివిధ అంశాలపై అవగాహన కల్పించి, పరీక్షలను నిర్వహించామని తెలిపారు. అర్హులైన వారి నమోదుకు జాబితాలను సంబంధిత ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. బీఎల్వోలు వారి పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను సేకరించాలని, కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో నమోదయ్యేలా జాగ్రత్తలు వహించాలన్నారు. దివ్యాంగులు, వయో వృద్ధులను గుర్తించి వారి వివరాలను ప్రత్యేకంగా నమోదు చేయాలన్నారు. ఎన్నికల డీటీ ఆనంద్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): తప్పుడు హామీలతో ప్రజలను మభ్యపెట్టి చంద్రబాబు అధికారంలోకి వచ్చారని, ప్రస్తుతం ప్రజలను నిలువునా దగా చేస్తున్నారని, ఈ మేరకు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నగర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గూడూరులో మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో నియోజకవర్గ స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. ఇందులో నెల్లూరు రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్ రెడ్డి, వెంకటగిరి ఇన్‌చార్జి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితో పాటు పర్వతరెడ్డి హాజరై, రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాలు, వైఎస్సార్‌సీపీ నేతలపై పెడుతున్న అక్రమ కేసులు, ఆస్తుల విధ్వంసానికి పాల్పడుతున్న వైనాన్ని ప్రజలకు వివరించారు. ప్రతిఒక్కరి స్మార్ట్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి చంద్రబాబు మేనిఫెస్టో, ప్రభుత్వ మోసపూరిత విధానాలను ఎండగట్టాలని కోరారు.

లాడ్జీల్లో ఆకస్మిక తనిఖీ


బ్యాగ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ దశరథరామారావు

నెల్లూరు(క్రైమ్): నేర నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడిలో భాగంగా బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు నగర పోలీసు అధికారులు పలు లాడ్జీలను ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రతి గదిని పరిశీలించి అక్కడ బసచేసిన వారిని ఎన్ని రోజుల నుంచి ఉన్నారు? ఎక్కడి నుంచి.. ఏ పనిమీద వచ్చారు? అనే వివరాలతో పాటు వ్యక్తిగత వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారి లగేజీలను తనిఖీ చేశారు. లాడ్జీలో దిగిన వ్యక్తుల ఆధార్ కార్డుతో పాటు వారి పూర్తి వివరాలతో రిజిస్టర్‌ను తప్పని సరిగా నిర్వహించాలని, ఆ వివరాలను ప్రతిరోజూ స్థానిక పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలని నిర్వాహకులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలన్నారు. నగర పోలీసు అధికారులు చిట్టెం కోటేశ్వరరావు, కె.వేణుగోపాల్‌రెడ్డి, జి.దశరథరామారావు, కె.రోశయ్య, కె.శ్రీనివాసరావు, జి.సాంబశివరావు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థలో ఆప్కాస్ ద్వారా పనిచేస్తున్న తమకు చాలీచాలని జీతాలతో బతుకుతున్నామని.. మా పొట్ట కొట్టొద్దని కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఎన్‌ఎంసీలో పారిశుద్ధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తూ పిలిచిన టెండర్లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. అక్కడ అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. చాలీచాలని జీతాలతో బతుకుతున్న ఇంజినీరింగ్ కార్మికులకు తక్షణమే వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బలహీన వర్గాల కడుపులు కొట్టి కాంట్రాక్టర్ల జేబులు నింపే టెండర్లను తక్షణమే రద్దు చేయాలని నినాదాలు చేశారు. అనంతరం సీపీఎం జిల్లా నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, సీఐటీయూ నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడారు. ఇంజినీరింగ్ విభాగం కార్మికులు అతి తక్కువ జీతం పొందుతున్నారని, ఫలితంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే జీఓ 36 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వం పట్టించుకోకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సీఐటీయూ రూరల్ కార్యదర్శి కె.పెంచల నరసయ్య, నాయకులు అజీజ్, సుధాకర్, చిరంజీవి, యూనియన్ నాయకులు మట్టిపాటి శ్రీనివాసులు, సుజాతమ్మ, లోకేష్, అశోక్, మనోజ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4లో భాగస్వాములు కావాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరురూరల్: పీ–4 కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ ఆనంద్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఇన్‌చార్జి ముఖ్య ప్రణాళికాధికారి లక్ష్మీనరసింహ ఆధ్వర్యంలో పీ–4 కార్యక్రమంపై శిక్షణ, వర్క్‌షాప్‌ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, సచివాలయ సిబ్బంది ఎమ్మెల్యేలు, స్థానిక రాజకీయ నాయకులను కలుపుకుని పీ–4 కార్యక్రమ అమలును వివరించాలని, దీనిని ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి కార్యక్రమాన్ని ముందుకు నడపాలన్నారు. దీనిపై సందేహాల నివృత్తికి 1800–425–1999 కాల్ సెంటర్ ఉందని వివరించారు. పీ–4 ద్వారా గుర్తించిన బంగారు కుటుంబాలకు అవసరమైన సలహాలు సంప్రదింపులు, వృత్తి నైపుణ్యత శిక్షణ, వ్యాపార అభివృద్ధికి అవసరమైన సహాయాన్ని అందించి ప్రగతి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఆత్మకూరు డివిజనల్ అధికారి పావని, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.